షెడ్డు కూల్చివేత



గాయత్రీనగర్‌లో ఎక్స్‌కవేటర్‌తో షెడ్డును తొలగిస్తున్న సిబ్బంది

అల్లాపూర్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రాకపోకలకు ఇబ్బందిగా ఉందనే ఫిర్యాదుకు స్పందించిన 'హైడ్రా' అధికారులు మంగళవారం అల్లాపూర్ డివిజన్ గాయత్రీనగర్‌లోని ఓ షెడ్డును కూల్చి వేశారు. తమ రాకపోకలను అడ్డుకునే విధంగా షెడ్డు ఉందని పర్వత్‌నగర్ వాసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కూల్చివేత చేపట్టినట్టు సమాచారం. పోలీసుల సమక్షంలో సిబ్బంది, ఎక్స్‌కవేటర్ సాయంతో చేపట్టిన కూల్చివేత స్థానికుల్లో చర్చనీయాంశమైంది. షెడ్డును పూర్తిగా కూల్చివేసిన అధికారులు తదనంతరం శిథిలాలను కూడా తొలగించారు.

కార్మికుడికి గాయాలు

జీడిమెట్ల, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల పారిశ్రామికవాడలోని ఎస్‌వీ కోపరేటివ్ సొసైటీలోని ఓ ఇంజనీరింగ్ పరిశ్రమలో యంత్రంలో కాలుపడి విగిపోయింది. ఈ సంఘటన మంగళవారం ఉదయం జరిగింది. సుభాష్‌నగర్‌కు చెందిన నానిబాబు(45) అనే కార్మికుడు గ్లోబల్ టెక్నాలజీస్ అనే ఇంజనీరింగ్ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ప్రమాదవశాత్తు కాలు యంత్రంలో పడడంతో ఎడమకాలు పూర్తిగా విరిగిపోయింది. 108 సిబ్బంది సకాలంలో అక్కడికి చేరుకొని ఈఎస్‌ఐ ఆస్పత్రికి తరలించారు. చికిత్స చేస్తున్నారు.

బంగారం షాపులో దృష్టి మళ్లించి చోరీ

- నిందితురాలి అరెస్టు



నిందితులరాలి నుంచి స్వాధీనం చేసుకున్న ఆభరణాలు

హైదర్‌నగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులుగా బంగారం షాపునకు వచ్చి సేల్స్‌మన్ కన్నుగప్పి బంగారు ఆభరణాలు చోరీ చేసిన ఓ మహిళను కేపీహెచ్‌బీ పోలీసులు అరెస్టు చేశారు. కూకట్‌పల్లి జోన్ ఏసీపీ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం... మియాపూర్‌లోని గోకుల్‌టవర్స్‌కు చెందిన పుట్టా సునీత(41) ఈనెల 23న కేపీహెచ్‌బీకాలనీ రోడ్ నంబర్-1 లోని దేవి జువెల్లెర్స్‌కు నగలు కోనేందుకని వచ్చింది. ముఖానికి మాస్క్ ధరించి నగలు చూపించాల్సిందిగా సేల్స్‌మన్‌ను కోరింది.

నగలు చూపిస్తుండగా అతని దృష్టి మరల్చి బంగారు నగలు దొంగిలించి అక్కడి నుంచి వెళ్లిపోయింది. ఆమె వెళ్లిన తర్వాత నగలు పోయినట్లుగా గుర్తించిన షాప్ యజమాని కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ ఫుటేజ్ ఆధారంగా చోరీకి పాల్పడ్డ సునీతను పాత నేరస్థురాలిగా గుర్తించి దర్యాప్తు చేపట్టారు. ఏసీపీ శ్రీనివాస్‌రావు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని డీఐ రవికుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి పుట్టా సునీతను మంగళవారం అరెస్టు చేశారు. ఆమె వద్ద నుంచి రూ.2,90,000 విలువైన 73 గ్రాముల బంగారు నెక్లెస్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

ఎస్‌ఏ పోస్టులను డైరెక్ట్‌గా భర్తీచేయాలి

- బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కష్ణయ్య



బీఈడీ నిరుద్యోగ అభ్యర్థుల ధర్నాకు మద్దతు తెలుపుతున్న ఆర్.కృష్ణయ్య, చైర్మన్ నీల వెంకటేష్ తదితరులు

కవాడిగూడ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ) పోస్టులను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారానే భర్తీ చేయాలని ఎస్‌జీటీ టీచర్లకు ఇచ్చే 70 శాతం ప్రమోషన్లను పూర్తిగా తొలగించాలని మాజీ ఎంపీ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీఈడీ నిరుద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో తెలంగాణ రాష్ట్ర బీఈడీ నిరుద్యోగ అభ్యర్థుల సంఘం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీఈడీ నిరుద్యోగ అభ్యర్థులు హాజరయ్యారు. ఆర్. కృష్ణయ్య నిరుద్యోగులకు సంపూర్ణ మద్దతు ప్రకటించి ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డీఈడీ చేసిన వారికి వందశాతం డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా ఎస్‌జీటీ ఉద్యోగాలు ఏవిధంగా భర్తీ చేస్తున్నారో.. స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగాలను కూడా కేవలం బీఈడీ అభ్యర్థులతో మాత్రమే భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. 2011లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ద్వారా బీఈడీ అభ్యర్థులకు ఎస్‌జీటీ పరీక్ష రాసే అవకాశం కోల్పోయారని బీఈడీ అభ్యర్థుల పోరాట ఫలితంగా కేంద్ర ప్రభుత్వం బీఈడీ చదివిన అభ్యర్థులకు ఎస్‌జీటీలకు ఉద్యోగ అవకాశాలు కల్పించిందన్నారు. ఎస్‌జీటీ ఉద్యోగం పొందిన రెండు సంవత్సరాలలోపు ఆరు నెలల బ్రిడ్జి కోర్సు చదివి పాసవడానికి అవకాశం ఇస్తూ ఇచ్చిన గెజిట్ చెల్లుబాటు కాదన్నారు. 2023లో గెజిట్ చెల్లదని కోర్టు తీర్పుద్వారా బీఈడీ అభ్యర్థులు ఎస్‌జీటీ ఉద్యోగం పొందే అవకాశం కోల్పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జీవో 108 ప్రకారం స్కూల్ అసిస్టెంట్ పోస్టులను 70 శాతం ప్రమోషన్లతో భర్తీ చేస్తే.. బీఈడీ నిరుద్యోగ అభ్యర్థుల భవిష్యత్ ఏమిటని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ మహాధర్నాలో నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్, నిరుద్యోగ జేఏసీ నాయకులు కల్యాణ్ నాయక్, నరేష్, బీఈడీ అభ్యర్థుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూక్యానాయక్, అశోక్, నందగోపాల్, సుధాకర్, రంజిత్, శంకర్‌తోపాటు బీఈడీ అభ్యర్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దోమల పేరుతో దోచుకోలేరు!

- వీడియో రికార్డింగ్‌తో డీజిల్‌కు పక్కా లెక్కలు!
- పారిశుధ్య విభాగం ప్రక్షాళన అయినట్టేనా ?
- కూకట్‌పల్లి జోన్‌లో అవినీతి మరకకు చెక్ పడినట్టేనా?



కూకట్‌పల్లి సర్కిల్‌లో ఆకస్మిక తనిఖీ చేస్తున్న జడ్సీ అపూర్వ్ చౌహాన్ (ఫైల్)

కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): దోమల పేరుతో నిధులను దోచేయడం ఇక కుదరదు. మూడు నెలల క్రితం కూకట్‌పల్లి జోన్‌లో అవినీతి ముద్రతో ఓ అధికారిణిపై బదిలీవేటు పడిన విషయం తెలిసిందే. అప్పట్లో ఇది గ్రేటర్‌లోనే హాట్ టాపిక్‌గా మారినా సదరు అధికారిణిపై మాత్రం ఆశించిన స్థాయిలో చర్యలు తీసుకోలేదనే చెప్పాలి. గతంలో సెలవులు, ఇతరత్రా విధుల్లో పాల్గొన్న సమయంలో కూడా డీజిల్, ఇతరత్రా నిధులు డ్రా చేయడంతో ఎంటమాలజీ విభాగంపై అవినీతి ముద్ర పడింది. తీగలాగితే డొంక కదులుతుందేమోనని ఓ ఇద్దరు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఎంక్వైరీ సమయంలోనే బల్దియా ప్రధాన కార్యాలయానికి అటాచ్ చేసి చేతులు దులుపుకోవడం తీవ్ర విమర్శల పాలైంది.

కూకట్‌పల్లి జోన్‌లో ఇలా..

జీహెచ్‌ఎంసీ కూకట్‌పల్లి జోన్ పరిధిలో కూకట్‌పల్లి, మూసాపేట్, కుత్బుల్లాపూర్, గాజులరామారం, అల్వాల్ సర్కిళ్ల పరిధిలో 22 వార్డులు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేయడం, దాన్ని పర్యవేక్షించడం అంతసులువైన పనేంకాదంటున్నారు. గతంలో జరిగిన అవినీతిని నిర్మూలించడంతో ఉద్యోగుల యాంటి లార్వా ఆపరేషన్, సాయంత్రం ఫాగింగ్ చేసే సిబ్బంది అటెండెన్స్ పక్కాగా ఆన్‌లైన్‌లో జరుగుతోందని చెపొచ్చు. కానీ, డీజిల్ కుంభకోణం జరగకుండా ఉండేందుకు ఎస్‌డబ్ల్యూఎం ఏఎంసీ ఉదయ్‌కుమార్‌కు జోన్ ఎంటమాలజీ విభాగం బాధ్యతలు కూడా నిర్వర్తిస్తున్నారు. దీంతో జడ్సీ అపూర్వ్ చౌహాన్ సూచనల మేరకు డీజిల్ పక్కదారి పట్టకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కూకట్‌పల్లి, మూసాపేట్‌కు ఒకచోట, కుత్బుల్లాపూర్, గాజులరామారం, అల్వాల్ సర్కిళ్ల పరిధిలో ఒక్కో పెట్రోల్ బంకులో డీజిల్ నింపుకునే సమయంలో వీడియో రికార్డింగ్ తప్పనిసరి చేశారు. దీంతో కొంతమేర అయినా పోయించుకోకుండా పోయించుకున్నట్టు ఆయా బంకుల సిబ్బందితో కుమ్మక్కయ్యే విధానానికి స్వస్తి పలికామని అధికారులు చెబుతున్నారు. దీనికి తోడు గతంలో 9 లీటర్లు డీజిల్ ఇచ్చేవారు.. కానీ గత రెండు వారాలుగా 6 లీటర్లకే పరిమితం చేశారు. దీంతో సత్ఫలితాలు ఇస్తున్నాయని భావిస్తున్నారు. ప్రతి నెలా ఎక్కడెక్కడ యాంటి లార్వా, ఫాగింగ్ చేస్తున్నారో తెలిపే జాబితాను ప్రకటిస్తున్నామని అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరువ కావడం లేదు. కనీసం 15 రోజులకు ఓ సారి కూడా ఫాగింగ్ జరుతున్న దాఖలాలు కన్పించడం లేదు. అధికార యంత్రాంగం ఎన్ని టెక్నిక్స్ ఉపయోగించినా పనిచేసే సిబ్బందిలో మార్పు రాకపోతే ఏం ప్రయోజనం? సిబ్బందిని ఉరుకులు పరుగులు పెట్టించడం కన్నా ప్రజలకు చేరువ చేసేలా చర్యలు తీసుకుంటునే క్షేత్రస్థాయిలో ఉపయోగం ఉంటుంది.

పనితీరుపై ఆకస్మిక తనిఖీలు..

గ్రేటర్ హైదరాబాద్‌లో కూకట్‌పల్లి జోన్‌లో పనిచేయకుండానే నిధులు డ్రా పెద్ద దుమారం రేపిన నేపథ్యంలో ఆ మరకను తుడిచేసుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారని చెప్పొచ్చు. జడ్సీ అపూర్వ్ చౌహాన్ ఆయా సర్కిళ్ల డీసీలతో కలిసి ఫాగింగ్, లార్వా చేస్తున్న సిబ్బంది పనితీరును పరిశీలిస్తున్నారు. ఆ విభాగం ఇన్‌చార్జి ఉదయ్‌కుమార్ కూడా అవసరం ఉన్న మేరకే డీజిల్, పెట్రోల్ కూపన్లు ఇస్తున్నారు. అటెండెన్స్ ఆధారంగా ఎంత మంది హాజరయ్యారు.. ఎంత డీజిల్ అవసరం ఉందన్నది గుర్తించి ఆ మేరకు జోన్ కార్యాలయం నుంచి కూపన్లు పంపిణీ చేస్తున్నారు. జోన్ పరిధిలో రోజుకు 600 లీటర్ల డీజిల్ ఫాగింగ్ కోసం వినియోగిస్తున్నట్టు అధికారులు తెలిపారు. గతంలో పని చేయకుండానే నిధులు స్వాహా.. కానీ, నేడు పనిచేసే దాంట్లో కూడా ఆదా అయ్యేలా చూస్తున్నామంటున్నారు.

యువకుడికి అరుదైన శస్త్రచికిత్స



యువకుడికి సర్జరీ చేస్తున్న వైద్యులు

హైదరాబాద్ సిటీ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సన్‌షైన్ బోన్ అండ్ జాయింట్ ఇనిస్టిట్యూట్‌లోని షోల్డర్ సర్జరీ విభాగం, కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రిలో 'ఆర్థోస్కోపిక్ కార్టిలేజ్ షోల్డర్ రిపేర్' అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. పాతికేళ్ల యువకుడు బాస్కెట్‌బాల్ ఆడుతుండగా భుజానికి తీవ్ర గాయమైంది. బేగంపేటలోని ఆస్పత్రికి వచ్చిన అతడికి పరీక్షించిన వైద్యులు ఇటీవల ఆర్థోస్కోపిక్ కార్టిలేజ్ రిపేర్ సర్జరీ చేసినట్లు చీఫ్ షోల్డర్ సర్జన్ డాక్టర్ బి.చంద్రశేఖర్ తెలిపారు. ఈ సర్జరీని హైదరాబాద్‌లో మొట్టమొదటిసారిగా చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకొని కొండ్రో పిల్లర్ టెక్నాలజీ సాయంతో చికిత్స అందించినట్లు వివరించారు. ఎవరైనా భుజం నొప్పి, కదలికలు సరిగ్గా లేకపోవడం వంటి సమస్యలతో బాధపడుతుంటే సరైన చికిత్స తీసుకోవాలని ఆయన సూచించారు.

సంక్షేమ పథకాలలో రాజకీయాలు తగవు



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, కార్పొరేటర్, కాంగ్రెస్ నాయకులు

కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాలను అందించే విషయంలో రాజకీయాలు చేయడం సరికాదని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కేపీహెచ్‌బీలోని తాహసీల్దార్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మంత్రి అపాయిట్‌మెంట్ కోసం నెలరోజులుగా చెక్కులు ఇవ్వకుండా రెవెన్యూ అధికారులు జాప్యం చేశారని ఆరోపించారు. తప్పుడు సమాచారాన్ని అధికార పార్టీ నాయకులు సోషల్ మీడియాలో ప్రచారం చేయడంపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యక్రమాలకు రాజకీయాలను జోడించకుండా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సజావుగా జరిగేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఇద్దరు వేర్వేరు పార్టీలకు చెందిన వారు కావడంతో ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు భారీగా చేరుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ప్రభుత్వ కార్యక్రమం కావడంతో కార్పొరేటర్లు మందడి శ్రీనివాసరావు, పగుడాల శిరీషబాబురావు, సబీహా బేగం, జూపల్లి సత్యనారాయణతో కలిసి చెక్కులను ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పంపిణీ చేశారు.

బాలానగర్ మండల కార్యాలయంలో..

బాలానగర్, నవంబర్ 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నుంచి మంజూరైన 208 కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులకు మంగళవారం బాలానగర్ మండల కార్యాలయంలో తహసీల్దార్ వైఎస్.శ్రీనివాస్, కార్పొరేటర్లతో కలిసి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చెక్కులను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇచ్చే వాళ్ళమని, ఇప్పుడు అధికారులు ఎమ్మెల్యేనే మండల కార్యాలయానికొచ్చి చెక్కులు ఇచ్చేపరిస్థితి తీసుకురావడం మంచి సాంప్రదాయం కాదన్నారు. ఈపద్ధతిని అధికారులు మార్చాలన్నారు. కార్యక్రమంలో బాలానగర్ తహసీల్దార్ శ్రీనివాస్, కార్పొరేటర్లు నర్సింహయాదవ్, జూపల్లి సత్యనారాయియణ, పండాల సతీష్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

- బాలానగర్ మండల కార్యాలయంలో ఎమ్మెల్యే కృష్ణారావు చెక్కులు పంపిణీ చేసి వెళ్లిపోయిన అనంతరం మిగిలిన చెక్కులను కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఏ బ్లాక్ అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ లక్ష్మయ్య, ఏ బ్లాక్ ఉపాధ్యక్షులు మాదిరెడ్డి యుగంధర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు మధుగౌడ్, పులిశివకుమార్‌గౌడ్, కిట్టు, ప్రసన్న, మహేందర్, ఆకుల నరేందర్, హేమంత్, మల్లికార్జున్‌యాదవ్, అస్లాం, అరుణ్‌గౌడ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



రాజిరెడ్డి సన్మాన కార్యక్రమంలో సెక్షన్ ఉద్యోగులు, యూనియన్ నాయకులు

ఫతేనగర్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): జలమండలి ఉద్యోగులు, కార్మికుల సమస్యలు త్వరలోనే పరిష్కారమవుతాయని జలమండలి కాంగ్రెస్ యూనియన్ అధ్యక్షుడు మెగుళ్ల రాజిరెడ్డి అన్నారు. యూనియన్ కృషి వల్ల పెండింగ్‌లో ఉన్న 75 లక్షల ఉద్యోగుల ఎన్.ఎమ్.ఆర్ ఏరియర్స్‌ను ప్రభుత్వం విడుదల చేసిన సందర్భంగా ఫతేనగర్‌లో జలమండలి ఉద్యోగులు రాజిరెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ... ఉద్యోగులకు ఉచిత హెల్త్ కార్డులు, ప్రమోషన్లు ఇప్పించేందుకు యూనియన్ నేతలు జలమండలి బోర్డు మేనేజింగ్ డైరెక్టర్‌ను కలిసి సమస్యలు వివరించినట్లు తెలిపారు. అనంతరం పలువురు కార్మికులు కంగార్ యూనియన్‌లో చేరగా వారిని యూనియన్‌లోకి సాదరంగా ఆహ్వానించారు. ఫతేనగర్ సెక్షన్ జలమండలి యూనియన్ నాయకుడు శివరాంప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో యూనియన్ అసోసియేట్ అధ్యక్షుడు భూమయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ రామరాజు, ప్రధాన కార్యదర్శి సురేశ్‌బాబు, గుర్తింపు పొందిన యూనియన్ అధ్యక్షుడు సతీష్‌కుమార్, రాంబాబు యాదవ్ పాల్గొన్నారు.

క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలి



ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో రాజశేఖర్‌రెడ్డి, లక్ష్మణ్‌రావు

కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): అధ్యాపక్ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో 25 సీబీఎస్ స్కూల్స్ స్టూడెంట్స్‌కు మంగళవారం క్రీడా పోటీలు నిర్వహించారు. కేపీహెచ్‌బీ రోడ్డు నంబర్-1, ఆరోపేజ్ ఇండోర్ స్టేడియం, చందానగర్ పీజేఆర్ స్టేడియాల్లో ఖోఖో, కబడ్డీ, క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, త్రోబాల్, స్విమ్మింగ్, బాస్కెట్ బాల్, ఫుట్ బాల్‌కు డీపీఎస్, ఒక్రిడ్జ్, సిల్వర్ ఓక్స్, మేరు ఇంటర్నేషనల్, జెనిసిస్, ఓబుల్‌రెడ్డి తదితర స్కూల్స్ నుంచి విద్యార్థులు హాజరయ్యారు. విజేతలను అధ్యాపక్ కళాశాల డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి, లక్ష్మణ్‌రావు అభినందించారు. తమ కళాశాలలో చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు.

అన్నదమ్ముల వక్రమార్గం

- డబ్బు కోసం గంజాయి సరఫరా
- 18 కిలోల పట్టివేత
- సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో ఇద్దరి అరెస్టు
- వెస్ట్ బెంగాల్ టు మహారాష్ట్రకు గంజాయి సరఫరా



కేసు వివరాలు వెల్లడిస్తున్న జీఆర్‌పీ పోలీసులు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో జీఆర్‌పీ పోలీసులు రూ. 4.50 లక్షల విలువ చేసే 18 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రైల్వే డీఎస్‌పీ జావెద్, సికింద్రాబాద్ రైల్వే ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్ వివరాలను వెల్లడించారు. పశ్చిమ బెంగాల్ హుగ్లీ మండలం రత్‌టాలా గ్రామానికి చెందిన ప్రీతం చౌదరి(37), సత్యం చౌదరి(29) అన్నదమ్ములు. సులభంగా డబ్బు సంపాదించేందుకు గంజాయి విక్రయించాలని నిర్ణయించుకున్నారు. సోమవారం పశ్చిమ బెంగాల్‌లోని షాలిమార్ పట్టణంలో 18 కిలోల గంజాయి కొనుగోలు చేశారు. ముంబైలో విక్రయించేందుకు రైలులో గంజాయి బ్యాగులతో వస్తున్నారు. మంగళవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో జీఆర్‌పీ సీఐ సాయి ఈశ్వర్‌గౌడ్, ఎస్ఐ మాజిద్, రమేష్‌తో పాటు కానిస్టేబుళ్లు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ప్లాట్ ఫాం నంబరు 2లో ఆగి ఉన్న ముంబై ఎక్స్‌ప్రెస్‌లో లగేజీలను తనిఖీ చేశారు. అన్నదమ్ములను పోలీసులు అదుపులోకి తీసుకుని గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పశ్చిమ బెంగాల్‌లో గంజాయి కొనుగోలు చేసి ఒక్కో ప్యాకెట్ రూ. 18 వేలకు మహారాష్ట్రలో విక్రయిస్తున్నట్లు విచారణలో తేలింది. రైల్వే ఎస్పీ చందనదీప్తి ఆదేశాల మేరకు ప్రతిరోజూ రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేస్తున్నామని జీఆర్‌పీ సీఐ తెలిపారు.

యువకుడిని చితకబాదిన పోలీసులు

- కేపీహెచ్‌బీ పోలీసుల అత్యుత్సాహం



గాయాలు చూపిస్తున్న ఇతిహాస్

హైదర్‌నగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): హైదర్‌నగర్‌లో పోలీసుల అత్యుత్సాహంతో ఓ అమాయకుడిని చితకొట్టి తీవ్రంగా గాయపరిచారు. ఈ సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదర్‌నగర్ సిరిబార్ అండ్ రెస్టారెంట్‌లో నయీమ్ అనే వ్యక్తి శివకుమార్, స్నేహితులతో కలిసి మద్యం తాగి అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో బార్ నుంచి బయటికి వచ్చారు. అదే సమయంలో అక్కడే ఉన్న ప్రణయ్, నరేష్, అతడి స్నేహితులు ఒకరినొకరు ఆటపట్టించుకుంటూ మాట్లాడుకుంటున్నారు. నయీమ్, శివకుమార్ తమను చూసి ఎగతాళి చేసుకుంటూ నవ్వుతున్నారని భావించిన నయీమ్ ప్రణయ్‌పై చేయి చేసుకోవడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. వారిని గమనించిన ఇతిహాస్ అనే పూల వ్యాపారి గొడవని ఆపాలని ప్రయత్నించాడు. అదే సమయంలో ప్రణయ్ కేపీహెచ్‌బీ పోలీసులకు ఫోన్ చేయగా పెట్రోలింగ్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసులు వచ్చే సమయానికి నయీమ్, అతడి స్నేహితులు అక్కడి నుంచి పరారయ్యారు. అక్కడే నిల్చున్న శివకుమార్‌ను పోలీసులు ఎదురుగానే ప్రణయ్, అతడి స్నేహితులు దాడి చేసి ఫోన్ లాక్కున్నారు. పోలీసులు మాత్రం గొడవ విషయాన్ని తెలుసుకోకుండానే గొడవని ఆపడానికి ప్రయత్నించిన ఇతిహాస్‌ను లాఠీతో చితకబాది ఇంటికి వెళ్లిపొమ్మని చెప్పి పోలీసులు వెళ్లిపోయారు. గొడవకు సంబంధంలేని ఇతిహాస్‌ను దారుణంగా కొట్టిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని ఇతిహాస్ కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయమై ఇతిహాస్ మంగళవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును కలిసి తన గోడు వెళ్లబోసుకున్నారు.

అంబేడ్కర్‌కు నివాళి



భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందామని అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న హెచ్ఏఎల్ ఉద్యోగులు

బాలానగర్, నవంబర్ 26(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ దివస్ సందర్భంగా హెచ్ఏఎల్ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హెచ్ఏఎల్ మెయిన్ గేటు ఎదుట ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పరిశ్రమ ఉద్యోగులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందామని హెచ్ఏఎల్ ఉద్యోగులు ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమానికి డీజీఎం సూర్యకుమార్ ముఖ్య అతిథిగా హాజరై అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ ప్రహ్లాద్, సత్యనారాయణ, గుర్తింపు పొందిన కార్మిక యూనియన్ అధ్యక్షుడు విజయప్రసాద్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ గణేష్, కర్కనాగరాజు, చందర్‌రావు నాయక్ సబ్బతుల్లా, ఎస్టీ, ఎస్సీ అసోసియేషన్ అధ్యక్షుడు పట్టురమేష్, కిషన్ నాయక్ ప్రధాన కార్యదర్శులు అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వై జంక్షన్ వద్ద...

రాజ్యాంగ దివస్ సందర్భంగా వై జంక్షన్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి దళిత ఐక్య వేదిక సభ్యులు పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐక్యవేదిక సభ్యులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వం తీసుకుంటే భద్రతా, భరోసా



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పద్మాచౌదరి, సత్తార్, రమాదేవి తదితరులు

కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వం తీసుకున్న వారికి భద్రతో కూడిన భరోసా లభిస్తుందని ఆ పార్టీ మల్కాజిగిరి పార్లమెంట్ అడహక్ కమిటీ సభ్యురాలు ఉప్పల పద్మాచౌదరి అన్నారు. ఈ మేరకు కేపీహెచ్‌బీ మూడోఫేజ్‌లోని పాలంటి అడ్డాలో మంగళవారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. స్త్రీ అభ్యున్నతి, మహిళలు ఆర్థికంగా ఎదుగుదలకు టీడీపీ ఎల్లప్పుడూ పెద్దపీట వేస్తోందన్నారు. రూ. 100 పెట్టి టీడీపీ సభ్యత్వం తీసుకుంటే రూ. 5లక్షల ప్రమాద బీమా, ఆ కుటుంబం ఆర్థిక ఎదుగుదలలో పార్టీ నుంచి సహాయ, సహకారాలు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్కే సత్తార్, జాస్తి రమాదేవి, కేతినేని కిషోర్, అయినంపూడి శివసత్యనారాయణ, వాసిరెడ్డి లక్ష్మీనారాయణ, తెలుగు యువత నాయకులు కాకర్ల గోపీకృష్ణ, కొల్లూరి శ్రీదేవి, మదన్మోహన్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు తిరుపతి దైవదర్శనం



దివ్యాంగులను తిరుపతి దైవదర్శనానికి తీసుకెళ్తున్న చుక్కాల చారిటిబుల్ ట్రస్ట్

సికింద్రాబాద్‌రైల్వే స్టేషన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): తిరుపతి దైవదర్శనం చేసుకోలేని వారికి చుక్కాల చారిటబుల్ ట్రస్ట్ ఫౌండేషన్ చేయూతనందిస్తోంది. ఫౌండేషన్ ప్రతినిధి డాక్టర్ వేణు నగర వ్యాప్తంగా 400 మంది దివ్యాంగులు, వృద్ధులను మగంళవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి రెండు ప్రత్యేక రైళ్లలో సొంత ఖర్చులతో తిరుపతికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేంకటేశ్వరస్వామి కృపమేరకు స్తోమత లేని నిరుపేదలు, దివ్యాంగులను ప్రతి ఏడాది తిరుపతి తీసుకెళ్తున్నానని తెలిపారు.

క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుతామంటూ

రూ. 2.29 లక్షలు కాజేత

హైదరాబాద్ సిటీ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుతామని 53 ఏళ్ల మహిళను నమ్మించిన సైబర్ క్రిమినల్స్ కార్డులో ఉన్న రూ. 2.29లక్షలు కొల్లగొట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన మహిళకు ఓ గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి యూనియన్ బ్యాంకు ఎగ్జిక్యూటివ్‌గా పరిచయం చేసుకున్నాడు. క్రెడిట్ కార్డు విభాగం నుంచి మాట్లాడుతున్నామని.. కార్డు లిమిట్‌ను రూ.5లక్షలకు పెంచుతున్నామ చెప్పాడు. అతడి మాటలు నమ్మిన మహిళ కార్డు వివరాలు, ఓటీపీలు చెప్పడంతో రూ. 2,29,180లు కొల్లగొట్టాడు. ఆలస్యంగా మెసేజ్‌లు చెక్ చేసుకున్న బాధితురాలు మోసపోయినట్లు గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేసింది.



అయ్యప్పపడి పూజలో కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్, నాయకులు

ఘనంగా అయ్యప్ప మహాపడిపూజ

హైదర్‌నగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ వెంకట పాపాయినగర్‌లో అక్షిత్ మణికంఠ గురుస్వామి, రాంబాబు, నాగజేత ఆధ్వర్యంలో అయ్యప్ప మహాపడి పూజ నిర్వహించారు. కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ రంగారావు హాజరై స్వామివారికి పూజలు చేశారు. కార్యక్రమంలో రామతేజ, నాగరాజు, నర్సింగరావు పాల్గొన్నారు.

హఫీజ్‌పేట గ్రామంలో

మియాపూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): హఫీజ్‌పేట గ్రామంలో గొల్ల కృష్ణ గురుస్వామి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన మహాపడి పూజలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో స్థానికులు బాలింగ్ గౌతమ్‌గౌడ్, ప్రసాద్, వెంకటేష్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, అయ్యప్ప మాలాధరణ భక్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు

దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలి

హైదర్‌నగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డిజిల్లా తెలంగాణ భవన్‌లో జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అధ్యక్షతన ఈ నెల 29న జరిగే దీక్షా దివస్ సన్నాహక సమావేశం మంగళవారం శంషాబాద్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ మంత్రులు మహమూద్ అలీ, సబితాఇంద్రారెడ్డి, మాజీ కార్పొరేటర్లు సాయిబాబా, రవియాదవ్, మాధవరం రంగారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 29న జరిగే కార్యక్రమానికి పెద్దసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మల్లారెడ్డి, రామకృష్ణ, అల్వాల్ గిరిబాబు, మనీష్, పర్వతాల సతీష్‌కుమార్, రవీంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

400 మంది దివ్యాంగులకు తిరుపతి దైవదర్శనం

- చుక్కాల చారిటబుల్ ట్రస్ట్ చేయూత



తిరుపతికి తీసుకెళుతున్న చుక్కాల చారిటబుల్ ట్రస్ట్

సికింద్రాబాద్‌రైల్వే స్టేషన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తిరుపతి దైవదర్శనం చేసుకోలేని వారికి చుక్కాల చారిటబుల్ ట్రస్ట్ ఫౌండేషన్ చేయుతనిందిస్తోంది. ఫౌండేషన్ ప్రతినిధి డాక్టర్ వేణు నగర వ్యాపితంగా 400 మంది దివ్యాంగులు, వృద్ధులను మంగళవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి రెండు ప్రత్యేక రైళ్లలో సొంత ఖర్చులతో తిరుపతికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1996లో ఒక్కన్నే తిరుపతికి వెళ్లేవాడినని, అనంతరం స్నేహితులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులను తీసుకెళ్లేవాడినని అన్నారు. వేంకటేశ్వరస్వామి కృపమేరకు స్తోమత లేని నిరుపేదలు, దివ్యాంగులను తిరుపతి దర్శనం చేయిస్తున్నానని తెలిపారు.

18 కిలోల గంజాయి పట్టివేత

- సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో అన్నదమ్ముల అరెస్టు
- వెస్ట్ బెంగాల్ నుంచి మహారాష్ట్రకు సరఫరా

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో జీఆర్‌పీ పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేస్తుండగా రూ.4.50 లక్షల విలువ చేసే 18 కిలోల గంజాయి సరుకును స్వాధీనం చేసుకన్నారు. సికింద్రాబాద్ రైల్వే డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రైల్వే డీఎస్పీ జావెద్, సికింద్రాబాద్ రైల్వే ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్ వివరాలను వెల్లడించారు. వెస్ట్ బెంగాల్ హోగ్లీ మండలం రత్‌టాలా గ్రామానికి చెందిన ప్రీతంచౌదరీ(37), సత్యంచౌదరీ (29) ఇద్దరూ అన్నదమ్ములు. సులువుగా డబ్బు సంపాదించుకునేందుకు గంజాయి సరుకును విక్రయించాలని అనుకున్నారు. ఈ సోమవారం వెస్ట్ బెంగాల్‌లోని శాలిమార్ టౌన్‌లో 18 కిలోల గంజాయి సరుకును కొనుగోలు చేశారు. ముంబైలో విక్రయించేందుకు ముంబై రైలులో గంజాయి బ్యాగులతో వస్తున్నారు. మంగళవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో జీఆర్‌పీ సీఐ సాయి ఈశ్వర్‌గౌడ్, ఎస్సై మాజీద్, రమేష్‌తో పాటు కానిస్టేబుళ్లు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నారు. ప్లాట్ ఫాం నెంబరు 2లో ఆగి ఉన్న ముంబై ఎక్స్‌ప్రెస్‌లో లగేజీలను తనిఖీ చేశారు. పక్కనే ఉన్న ఇద్దరు అన్నదమ్ములను పోలీసులు అదుపులోకి తీసుకుని గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వెస్ట్ బెంగాల్ గంజాయి సరుకును కొనుగోలు చేసి ఒక్కొక్క ప్యాకెట్ చొప్పున రూ.18 వేలకు మహారాష్ట్రలో విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. దీంతో అన్నదమ్ములను అరెస్టు చేసి వారి నుంచి గంజాయి పొడి సరుకును స్వాధీనం చేసుకన్నారు. రైల్వే ఎస్పీ చందనదీప్తి ఆదేశాల మేరకు ప్రతి రోజూ రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేస్తున్నామని జీఆర్‌పీ సీఐ తెలిపారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



టౌన్‌షిప్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఉన్నతాధికారులు, కార్మికులు



అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఈడీలు, అధికారులు



ప్రసంగిస్తున్న ఆచార్య రాందాసు

ఖైల్‌కాలనీ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ దినోత్సవం, బిర్సా ముండ జయంతిని బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌లో మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. భెల్ యాజమాన్యం, అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో భాగంగా ఎస్‌బీఐ బ్యాంక్ వద్ద నుంచి అంబేడ్కర్ స్టేడియం వరకు వాక్‌థాన్ నిర్వహించగా స్టేడియం వద్దగల అంబేడ్కర్ విగ్రహానికి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కెబి.రాజా పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పి అండ్ ఎస్‌డీ విభాగం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వై. శ్రీనివాసరావు, హెచ్‌ఆర్ జనరల్ మేనేజర్ వి. శ్రీనివాస్‌రావు, ఏజీఎం అమిత్‌కుమార్, సిఐఎస్ఎఫ్ కమాండెంట్ మంజీత్‌కుమార్, ఎస్టేట్ ఏజీఎం సురన్ ప్రసాద్, ఎస్సీ అసోసియేషన్ అధ్యక్షుడు సురేందర్, పలు విభాగాల ఉన్నతాధికారులు, ఓబీసీ అసోసియేషన్ ప్రతినిధులు, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

రాజ్యాంగంపై అవగాహన కలిగి ఉండాలి

ఖైల్‌కాలనీ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): భావి భారత పౌరులైన విద్యార్థులు రాజ్యాంగంపై అవగాహన కలిగి ఉండడంతో పాటు ప్రతీ పౌరుడు రాజ్యాంగాన్ని గౌరవించాలని హైదారాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం రాజనీతి శాస్త్ర విభాగ ఆచార్యులు ఆర్. రాందాను పేర్కొన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌లో గల శేరిలింగంపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సును నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ జి.రవీందర్, అధ్యాపకులు సురేష్, కమల్, నాగరాజు, ఫ్రెండ్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పోలీస్ బెటాలియన్‌లో ..



రాజ్యాంగ దినోత్సవంలో పాల్గొన్న బెటాలియన్ సన్నీ, అదనపు, సహాయ కమాండెంట్లు

గచ్చిబౌలి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కొండాపూర్ పోలీస్ బెటాలియన్‌లో కమాండెంట్ సన్నీ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది, కమాండెంట్ సన్నీ పాల్గొని రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరు గౌరవించాలని పిలుపునిచ్చారు. దేశంపై గౌరవం పెంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరికి రాజ్యాంగం కల్పించిన హక్కులు సామాజిక న్యాయం, ఆర్థిక, రాజకీయ, భావ వ్యక్తీకరణ న్యాయం, రాజ్యాంగంపై ఆరాధన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో బెటాలియన్ అదనపు కమాండెంట్లు, సహాయ కమాండెంట్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత కరువు

- వేసిన ఆరు నెలలకే పాడైపోతున్న సీసీ రోడ్లు
- అధికారుల సమావేశంలో ఎమ్మెల్యే గాంధీ అసంతృప్తి



ఇంజనీరింగ్ అధికారులు, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

మియాపూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించక పోవడంతో ప్రజాధనం వృథా కావడమే కాకుండా మళ్లీ సమస్యలు పునరావృతం అవుతున్నాయని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. మంగళవారం మియాపూర్‌లోని క్యాంపు కార్యాలయంలో జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారులు, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ చందానగర్ సర్కిల్ పరిధిలోని డివిజన్లలోని కాలనీలో నాసిరకంతో సీసీ రోడ్లు నిర్మించడం చాలా బాధకరమని, నాణ్యతప్రమాణాలు పాటించకపోవడంతో రోడ్డు వేసిన ఆరునెలల్లో దెబ్బతినడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నాసిరకంగా పనులు చేసిన కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని, బ్లాక్‌లిస్టులో పెట్టాలని. వారికి తిరిగి పనులు అప్పగించవద్దని ఆదేశించారు. అభివృద్ధి పనులు జరుగుతున్నప్పుడు నాణ్యత పాటిస్తున్నారో చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అశ్రద్ధ వహిస్తే అధికారులపై కూడా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆన్‌లైన్ టెండర్లలో కాంట్రాక్టర్లు రోడ్ల పనులను అంచన వ్యయంలో 25 శాతం కంటే తక్కువ ఖర్చు చేస్తునానరని, తమ లాభాల కోసం చూస్తున్నారని, టెండర్లలో పేర్కొన్న స్పెసిఫికేషన్ ప్రకారం పనుల్లో నాణ్యత పాటించచడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. నాణ్యత పాటించక పోవడంతోనే రోడ్లు వేసిన కొన్నినెలలకే పాడైపోతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఎస్ఈ శంకర్‌నాయక్, ఈఈ జీకేడీ ప్రసాద్, డీఈ ఆనంద్, ఏఈ సంతోష్, నాయకులు రఘునాథ్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

పోలియో కేంద్రం ఏర్పాటు చేయాలి

హైదర్‌నగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి డివిజన్ నల్లగండ్ల హుడాకాలనీలో శాశ్వతంగా ఓ పోలియో కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీకి కాలనీ వాసులు వినతిపత్రం అందజేశారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. నల్లగండ్ల హుడాకాలనీలో 20 వేల మందికి పైగా కుటుంబ సభ్యులు నివాసం ఉంటున్నారని కాలనీలో పోలియో కేంద్రం లేక ఇబ్బందులు పడుతన్నారని, తల్లిదండ్రులు తమ చిన్నారులకు పోలియో చుక్కలు వేయించేందుకు దూర ప్రాంతానికి వెళ్లాల్సి వస్తుందని వివరించారు. కార్యక్రమంలో కాలనీ వాసులు మంత్రిప్రగడ సత్యనారాయణరావు, వాసు శేఖర్, నవీన్, శివ తదితరులు పాల్గొన్నారు.



బీసీ కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న భెల్ ఓబీసీ సభ్యులు

ఖైల్‌కాలనీ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో సామాజిక, విద్యా, ఆర్థికంగా వెనకబడిన తరగతుల వివరాల కోసం జరుగుతున్న అధ్యయనంలో భాగంగా రాష్ట బీసీ కమిషన్ ఏర్పాటు చేసిన బహిరంగ విచారణకు హాజరైన బీహెచ్ఈఎల్ ఓబీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు 33 అంశాలతో కూడిన వివరాలను కమిషన్ దృష్టికి తీసుకువెళ్లారు. సమగ్ర కులగణన ద్వారా వెనకబడిన కులాలు, వర్గాలవారికి అండగా ఉండి విద్య, ఉపాధి, ఆర్థిక రంగాల్లో ప్రాతినిధ్యం కల్పించాలని కోరుతూ ఓబీసీ అసోసియేషన్ అధ్యక్షుడు రామరాజుయాదవ్, ప్రధాన కార్యదర్శి నాగమోహన్. సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆంజనేయులు, ఆర్గనైజింగ్ సెక్రటరీ తోకల రాజు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు కమిషన్ చైర్మన్‌ను నిరంజన్‌ను కోరారు. రాష్ట్రంలో జరుగుతున్న సమగ్ర కులగణన ద్వారా వెనకబడిన తరగతులకు మేలు జరగడంతో పాటు, స్థానిక సంస్థలు, విద్యా, ఉపాధి రంగాల్లో ప్రతినిధ్యం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బీహెచ్ఈఎల్‌కు చెందిన 20కి పైగా కుల సంఘాల ప్రతినిధులతో కలిసి ఓబీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యుల కమిషన్‌కు వివరాలను అందచేశారు.



యువకుడికి సర్జరీ చేస్తున్న దృశ్యం

యువకుడికి అరుదైన శస్త్రచికిత్స

హైదరాబాద్ సిటీ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సన్‌షైన్ బోన్ అండ్ జాయింట్ ఇనిస్టిట్యూట్‌లోని షోల్డర్ సర్జరీ విభాగం, కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రిలో 'ఆర్థోస్కోపిక్ కార్టిలేజ్ షోల్డర్ రిపేర్' అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. పాతికేళ్ల యువకుడు బాస్కెట్‌బాల్ ఆడుతుండగా భుజానికి తీవ్ర గాయమైంది. బేగంపేటలోని ఆస్పత్రికి వచ్చిన అతడికి పరీక్షించిన వైద్యులు ఇటీవల ఆర్థోస్కోపిక్ కార్టిలేజ్ రిపేర్ సర్జరీ చేసినట్లు చీఫ్ షోల్డర్ సర్జన్ డాక్టర్ బి.చంద్రశేఖర్ తెలిపారు. ఈ సర్జరీని హైదరాబాద్‌లో మొట్టమొదటిసారిగా చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకొని కొండ్రో పిల్లర్ టెక్నాలజీ సాయంతో చికిత్స అందించినట్లు వివరించారు. ఎవరైనా భుజం నొప్పి, కదలికలు సరిగ్గా లేకపోవడం వంటి సమస్యలతో బాధపడుతుంటే సరైన చికిత్స తీసుకోవాలని ఆయన సూచించారు.



ప్రజావాణిలో అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు చేస్తున్న మదర్‌సేవా స్వచ్ఛంద సంస్థ చైర్మన్ కొండల్‌రెడ్డి

అక్రమ నిర్మాణాలపై ప్రజావాణిలో ఫిర్యాదు

గచ్చిబౌలి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వెస్ట్‌జోన్ పరిధిలోని చందానగర్, శేరిలింగంపల్లి జంట సర్కిళ్లు అక్రమనిర్మాణాలకు వేదిక మారాయి. అక్రమ నిర్మాణాలను అడ్డుకునే నాథుడే కరువయ్యారు. అక్రమ నిర్మాణాలను అధికారులే ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. శేరిలింగంపల్లికి చెందిన మదర్‌సేవా సమితి స్వచ్ఛంద సంస్థ చైర్మన్ కొండల్‌రెడ్డి మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి కార్యాలయంలో ప్రజావాణిలో పాల్గొని ఫిర్యాదు చేశారు. కొండాపూర్ సిద్దిఖ్‌నగర్‌లో ఐదు అంతస్తుల భవనం ఒరిగిన సంఘటన తీవ్ర సంచలనం రేపింది. కేవలం 50, 60, 70 గజాల్లో ఐదు ఆరు అంతస్తులు కడుతున్నారని ఫిర్యాదులో వివరించారు. సుదర్శన్‌నగర్, టెలికాంనగర్, శిల్పాకాలనీ, రాఘవేంద్రకాలనీ, కొండాపూర్, మాదాపూర్, అయ్యప్పసొసైటీ ఈ అక్రమ నిర్మాణాల నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా బహుళ అంతస్తులు నిర్మిస్తున్నారు. ఈ విషయం అధికారులకు తెలిసిన తెలియనట్లు వ్యవహరిస్తున్నారని వివరించారు. ఎదైన ప్రమాదం జరగకముందే ప్రభుత్వం స్పందించి ఇలాంటి నిర్మాణాలకు అడ్డుకట్టవేయాలని కోరారు. అవినీతికి సహకరిస్తున్న అధికారులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసివారిపై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రేపు రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ సెలెక్షన్ ట్రయల్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఈ నెల 28వ తేదీన తెలంగాణ ఫెన్సింగ్ సంఘం (టీఎఫ్ఏ) రాష్ట్ర స్థాయి జూనియర్, సీనియర్ విభాగాల్లో సెలెక్షన్ ట్రయల్స్‌ను నిర్వహించనుంది. ఉదయం 8 గంటల నుంచి గచ్చిబౌలి స్టేడియంలోని ఇండోర్ హాల్‌లో ఈ ట్రయల్స్ జరగనున్నాయి. వచ్చే నెల మొదటి వారంలో జరగనున్న జాతీయ స్థాయి ఫెన్సింగ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే రాష్ట్ర క్రీడాకారులను ఈ పోటీల నుంచి ఎంపిక చేయనున్నారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు సొంత ఫెన్సింగ్ కిట్‌తో పాటు వయసు ధ్రువీకరణ పత్రంతో హాజరు కావాలని తెలంగాణ ఫెన్సింగ్ సంఘం సెలెక్షన్ కమిటీ సభ్యుడు ఎల్.సందీప్ కుమార్ జాదవ్ తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మియాపూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పీఎన్ఆర్ హిల్స్ 11కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 11 నుంచి 3 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. హెచ్ఎంటీకాలనీ రోడ్ నంబర్-14 నుంచి 30 వరకు, ఆర్బీసీ కాలనీ, బాలాజీ లేఔట్, గ్రేటర్ ఇన్‌ఫ్రా పరిధిలో విద్యుత్ ఉండదన్నారు.

బంగారం షాపులో దృష్టి మళ్లించి దోపిడీ

- నిందితురాలి అరెస్టు



నిందితురాలి నుంచి స్వాధీనం చేసుకున్న ఆభరణాలు

హైదర్‌నగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులుగా బంగారం షాపునకు వచ్చి సేల్స్‌మన్ కన్నుగప్పి బంగారు ఆభరణాలు చోరీ చేసిన ఓ మహిళను కేపీహెచ్‌బీ పోలీసులు అరెస్టు చేశారు. కూకట్‌పల్లిజోన్ ఏసీపీ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం... మియాపూర్‌లోని గోకుల్‌టవర్స్‌కు చెందిన పుట్టా సునీత(41) ఈనెల 23న కేపీహెచ్‌బీకాలనీ రోడ్ నంబర్-1 లోని దేవి జువెల్లర్స్‌కు నగలు కొనేందుకు అని వచ్చింది. ముఖానికి మాస్క్ ధరించి నగలు చూపించాల్సిందిగా సేల్స్‌మన్‌ను కోరింది. నగలు చూపిస్తుండగా అతని దృష్టి మరల్చి బంగారు నగలు దొంగిలించి అక్కడ మోడల్స్ నచ్చలేదంటూ అక్కడి నుంచి వెళ్లిపోయింది. ఆమె వెళ్లిన తర్వాత నగలు పోయినట్లుగా గుర్తించిన షాప్ యజమాని కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ పుటేజ్ ఆదారంగా చోరీకి పాల్పడ్డ సునీతను పాత నేరస్తురాలిగా గుర్తించి దర్యాప్తు చేపట్టారు. ఏసీపీ శ్రీనివాస్‌రావు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని డీఐ రవికుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి పుట్టా సునీతను మంగళవారం అరెస్టు చేశారు. ఆమె వద్ద నుంచి రూ.2,90,000 విలువైన 73 గ్రాముల బంగారు నెక్లెస్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

రోడ్డుపైనే వ్యర్థజలాల డంపింగ్

నివాస ప్రాంతాల్లో అక్రమ పరిశ్రమలను తొలగించాలి

- విషవాయువులను పీల్చి అనారోగ్యాల పాలవుతున్నాం
- వెంకటాద్రినగర్ వాసుల ఆవేదన



వెంకటాద్రినగర్‌లో వ్యర్థ జలాలు పారింది ఈ వీధిలోనే





నాలాను పరిశీలిస్తున్న వాటర్ వర్క్స్ మేనేజర్ అనూష, వెంకటాద్రినగర్‌లో అక్రమంగా నడుస్తున్న నకిలీ పెయింట్ కంపెనీ

జీడిమెట్ల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ సర్కిల్ సుభాష్‌నగర్ డివిజన్ వెంకటాద్రినగర్ అక్రమంగా నడుస్తున్న కొన్ని పరిశ్రమలు సోమవారం రాత్రి నివాస ప్రాంతాల్లో నడిరోడ్డుపై గుర్తు తెలియని కెమికల్స్‌ను డంప్ చేయడంతో స్థానికులు బెంబేలెత్తిపోయారు. కొంత కాలంగా వెంకటాద్రినగర్‌లో నివాస ప్రాంతాల్లో పెయింట్ కంపెనీలు, కెమికల్ డ్రమ్ములను నిల్వచేసి నాలాల్లో వదిలేస్తున్నారు. దీంతో కాలనీ వాసులు తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారు. ఈ విషయంపై జీహెచ్ఎంసీ అధికారులకు కూడా ఫిర్యాదు చేశారు. రాత్రి వేళల్లో నాలాల్లో కెమికల్స్ పొంగటంతో స్థానికులు ఆందళన చెందారు. మంగళవారం ఉదయం వాటర్ వర్క్స్ జీడిమెట్ల మేనేజర్ అనూష తన సిబ్బందితో అక్కడికి చేరుకుని నాలాను పరిశీలించారు. పీసీబీ అధికారులు కూడా జీడిమెట్ల పారిశ్రామికవాడ ప్రాంతంలోని వెంకటాద్రినగర్‌లో అక్రమంగా నడుస్తున్న కెమికల్ గోదాంలు, పెయింట్ కంపెనీలు, ఇతర పరిశ్రమలను పరిశీలించారు. స్థానికులు భూగర్భజలాలను అధికారులకు చూపించారు. బోరు నుంచి పూర్తిగా కెమికల్ వాటర్ వస్తుందని కనీసం వాడుకోవడానికి కూడా పనికి రాకుండా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అక్రమంగా కెమికల్ వ్యర్థ రసాయనాలను వదులుతున్న గంపలబస్తీ, వెంకటాద్రినగర్, ఎస్వీకోపరేటివ్ సొసైటీలోని అక్రమ గోదాంలు, పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని మహిళలను అధికారులను నిలదీశారు. తప్పకుండా చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు.

ప్రాణాలు పోతున్నాయి

జీడిమెట్ల పారిశ్రామికవాడ ప్రాంతంలో నివాసముంటున్న మాకు విషవాయువులు, వ్యర్థ జలాతో అనారోగ్యాల పాలవుతున్నాం. కంపెనీలు విషవాయువులను వదులుతుంటే కొందరు వ్యక్తులు అక్రమంగా నివాస ప్రాంతాల్లో కంపెనీలు ఏర్పాటు చేసుకుని కెమికల్ వ్యర్థాలు, కెమికల్ నీటిని రోడ్డుపైనే వదులుతున్నారు. జీహెచ్ఎంసీ, పీసీబీ అధికారులు చర్యలు తీసుకుని, నివాస ప్రాంతాల్లో ఉన్న కంపెనీలు తొలగించాలి.

- లక్ష్మి, వెంటాద్రినగర్

రోడ్డుపైనే వదిలేస్తున్నారు



గతంలో వర్షాలు వచ్చిన సమయంలో రోడ్డుపైనే రసాయనాలు వదిలేవారు. నేడు రాత్రి వేళల్లో రోడ్డుపై కెమికల్ నీటిని వదిలేస్తున్నారు. జీహెచ్ఎంసీ అధికారులు నివాస ప్రాంతాల్లో ఉన్న కంపెనీలను తొలగించాల్సిపోయి వారికి ట్యాక్స్‌లు వేస్తున్నారు. గంపలబస్తీ, సుభాష్‌నగర్, వెంకటాద్రినగర్‌లలో విచ్చలవిడిగా కెమికల్ గోదాంలు వెలుస్తున్నాయి. జిల్లా కలెక్టర్ తక్షణమే చర్యలు తీసుకుని ఈ పరిశ్రమలను తీసివేయాలి.

- జ్యోతి, వెంకటాద్రినగర్

పెండింగ్ పనులు పూర్తి చేయాలి



కాంట్రాక్టర్లతో మాట్లాడుతున్న మేయర్ నీలారెడ్డి, కమిషనర్ సాబేర్ అలీ

నిజాంపేట్, నవంబర్ 26 (ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ కార్పొరేషన్ మేయర్ కొలన్ నీలారెడ్డి, కమిషనర్ సాబేర్ అలీతో కలిసి కాంట్రాక్టర్లకు ఇవ్వాల్సిన బకాయిల విషయమై మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించారు. కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్ల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు గానూ వారికి ఇవ్వాల్సిన బకాయిల కోసం కాంట్రాక్టర్ల అధ్యక్షుడు హరినాథ్ ఆధ్వర్యంలో పలువురు కాంట్రాక్టర్లు చర్చించారు. ఈ సందర్భంగా మేయర్, కమిషనర్లు మాట్లాడుతూ త్వరలోనే కాంట్రాక్టర్లకు బకాయిలను ఇచ్చే విధంగా కృషి చేస్తామన్నారు. పెండింగ్ దశలో ఉన్న పనులను త్వరగా పూర్తిచేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ లక్ష్మీకుమారి, ఎస్ఈ సత్యనారాయణ, పలువురు కాంట్రాక్టర్లు ఉన్నారు.

● పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఆయా విభాగాల అధికారులు, సిబ్బందితో ఆమె కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్పొరేషన్ పరిధిలో నిర్మాణదశలో ఉన్న పనులు, పెండింగ్ అభివృద్ధి పనులతో పాటు కౌన్సిల్ సమావేశం నిర్వహణ వంటి కీలక అంశాలపై చర్చించారు. ప్రజలకు అవసరమైన ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని ఆమె అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు చిట్ల దివాకర్, సురేష్‌రెడ్డి, ఎస్.ఈ సత్యనారాయణ, మేనేజర్ పవన్‌కుమార్, టీపీఓ జ్యోత్స్న, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మేడ్చల్ జిల్లా గ్రంథాలయ చైర్మన్‌గా శ్రీనివాస్‌రెడ్డి ప్రమాణ స్వీకారం



జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

దుండిగల్, నవంబర్ 26(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ శాసన మండలి చీఫ్ విప్ ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. గ్రంథాలయాల అభివృద్ధికి తమవంతు కృషి చేయాలని మహేందర్‌రెడ్డి నూతన కమిటీ సభ్యులకు సూచించారు. ప్రభుత్వపరంగా ప్రజా అవసరాలకు తగ్గట్టుగా గ్రంథాలయాల్లో ఏర్పాట్లు చేసుకోవాలని మహేందర్‌రెడ్డి వారికి తెలిపారు. శ్రీనివాస్‌రెడ్డితో పాటు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వ్యవసాయ మార్కెట్ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహులుయాదవ్, వైస్ చైర్మన్ విట్టల్‌నాయక్, డైరెక్టర్లుగా కొలన్ మాధవరెడ్డి, వినోద్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ ప్రమాణ స్వీకార ఉత్సవంలో కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జి వజ్రేష్ యాదవ్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డితో పాటు జిల్లా, మండల స్థాయి నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు



సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందిస్తున్న ఎస్ఐ శంకర్

దుండిగల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధి బహదూర్‌పల్లి గ్రామంలోని హనుమాన్ దేవాలయంలో సేఫ్టీ సెక్యూరిటీలో భాగంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆలయ నిర్వాహకులు సగ్గిడి శ్రీనివాస్, సగ్గిడి నర్సింహరావును దుండిగల్ పోలీసులు కోరారు. పోలీసులు సూచన మేరకు వారు వెంటనే ఆరు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చారు. దీంతో శ్రీనివాస్, నర్సింహరావును దుండిగల్ ఎస్ఐ శంకర్ ఆలయంలోనే వారికి శాలువాలతో సన్మానించారు. దేవాలయంలో సేఫ్టీ నిమిత్తం సీసీ కెమెరాలను అడిగిన వెంటనే ఏర్పాటు చేసినందుకు వారిని ఎస్ఐ అభినందించారు.

కార్మికుడికి నష్టపరిహారం అందజేత



నష్టపరిహారాన్ని అందజేస్తున్న రవిసింగ్

షాపూర్‌నగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల ఇండస్ట్రియల్ ఏరియాలోని ప్లైవుడ్ సప్లయర్స్ షాపులో కార్మికుడిగా పనిచేస్తున్న యాదగిరి చేతి రెండువేళ్లకు గాయం అయింది. కార్మిక నాయకుడు, శ్రమశక్తి అవార్డుగ్రహీత రవిసింగ్‌ను సంప్రదించగా ఆయన సదరు యజమానితో మాట్లాడి కార్మికుడికి నష్టపరిహారంతో పాటు వైద్య ఖర్చుల కింద రూ.45 వేలు నష్టపరిహారం ఇప్పించారు. కార్యక్రమంలో అనిల్, సుదర్శన్, జగన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుడికి గాయాలు

జీడిమెట్ల, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల పారిశ్రామికవాడలోని ఎస్వీ కోపరేటివ్ సొసైటీలోని ఓ ఇంజనీరింగ్ పరిశ్రమలో యంత్రంలో కాలుపడి విరిగిపోయింది. ఈ సంఘటన మంగళవారం ఉదయం జరిగింది. సుభాష్‌నగర్‌కు చెందిన నానిబాబు(45) అనే కార్మికుడు గ్లోబల్ టెక్నాలజీస్ అనే ఇంజనీరింగ్ పరిశ్రమలో కార్మికుడిగ పనిచేస్తున్నాడు. ప్రమాదవశాత్తు కాలు యంత్రంలో పడడంతో ఎడమకాలు పూర్తిగా విరిగిపోయింది. 108 సిబ్బంది సకాలంలో అక్కడికి చేరుకొని ఈఎస్ఐ ఆస్పత్రికి తరలించారు. చికిత్స చేస్తున్నారు.

రోడ్డుపైనే వ్యర్థజలాల డంపింగ్

నివాస ప్రాంతాల్లో అక్రమ పరిశ్రమలను తొలగించాలి

- విషవాయువులను పీల్చి అనారోగ్యాల పాలవుతున్నాం
- వెంకటాద్రినగర్ వాసుల ఆవేదన



వెంకటాద్రినగర్‌లో వ్యర్థ జలాలు పారింది ఈ వీధిలోనే





నాలాను పరిశీలిస్తున్న వాటర్ వర్క్స్ మేనేజర్ అనూష, వెంకటాద్రినగర్‌లో అక్రమంగా నడుస్తున్న నకిలీ పెయింట్ కంపెనీ

జీడిమెట్ల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ సర్కిల్ సుభాష్‌నగర్ డివిజన్ వెంకటాద్రినగర్‌లో అక్రమంగా నడుస్తున్న కొన్ని పరిశ్రమలు సోమవారం రాత్రి నివాస ప్రాంతాల్లో నడిరోడ్డుపై గుర్తుతెలియని కెమికల్స్‌ను డంప్ చేయడంతో స్థానికులు బెంబేలెత్తిపోయారు. కొంత కాలంగా వెంకటాద్రినగర్‌లో నివాస ప్రాంతాల్లో పెయింట్ కంపెనీలు, కెమికల్ డ్రమ్ములను నిల్వచేసి నాలాల్లో వదిలేస్తున్నారు. దీంతో కాలనీ వాసులు తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారు. ఈ విషయంపై జీహెచ్ఎంసీ అధికారులకు కూడా ఫిర్యాదు చేశారు. రాత్రి వేళల్లో నాలాల్లో కెమికల్స్ పొంగటంతో స్థానికులు ఆందళన చెందారు. మంగళవారం ఉదయం వాటర్ వర్క్స్ జీడిమెట్ల మేనేజర్ అనూష తన సిబ్బందితో అక్కడికి చేరుకుని నాలాను పరిశీలించారు. పీసీబీ అధికారులు కూడా జీడిమెట్ల పారిశ్రామికవాడ ప్రాంతంలోని వెంకటాద్రినగర్‌లో అక్రమంగా నడుస్తున్న కెమికల్ గోదాంలు, పెయింట్ కంపెనీలు, ఇతర పరిశ్రమలను పరిశీలించారు. స్థానికులు భూగర్భజలాల ను అధికారులకు చూపించారు. బోరు నుంచి పూర్తిగా కెమికల్ వాటర్ వస్తుందని కనీసం వాడుకోవడానికి కూడా పనికి రాకుండా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అక్రమంగా కెమికల్ వ్యర్థ రసాయనాలను వదులుతున్న గంపల బస్తీ, వెంకటాద్రినగర్, ఎస్వీకోపరేటివ్ సొసైటీలోని అక్రమ గోదాంలు, పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని మహిళలు అధికారులను నిలదీశారు. తప్పకుండా చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ

ప్రాణాలు పోతున్నాయి

జీడిమెట్ల పారిశ్రామికవాడ ప్రాంతంలో నివాసముంటున్న మాకు విషవాయువులు, వ్యర్థ జలాతో అనారోగ్యాల పాలవుతున్నాం. కంపెనీలు విషవాయువులను వదులుతుంటే కొందరు వ్యక్తులు అక్రమంగా నివాస ప్రాంతాల్లో కంపెనీలు ఏర్పాటు చేసుకుని కెమికల్ వ్యర్థాలు, కెమికల్ నీటిని రోడ్డుపైనే వదులుతున్నారు. జీహెచ్ఎంసీ, పీసీబీ అధికారులు చర్యలు తీసుకుని, నివాస ప్రాంతాల్లో ఉన్న కంపెనీలు తొలగించాలి.

- లక్ష్మి, వెంటాద్రినగర్

రోడ్డుపైనే వదిలేస్తున్నారు



గతంలో వర్షాలు వచ్చిన సమయంలో రోడ్డుపైనే రసాయనాలు వదిలేవారు. నేడు రాత్రి వేళల్లో రోడ్డుపై కెమికల్ నీటిని వదిలేస్తున్నారు. జీహెచ్ఎంసీ అధికారులు నివాస ప్రాంతాల్లో ఉన్న కంపెనీలను తొలగించాల్సిపోయి వారికి ట్యాక్స్‌లు వేస్తున్నారు. గంపలబస్తీ, సుభాష్‌నగర్, వెంకటాద్రినగర్‌లలో విచ్చలవిడిగా కెమికల్ గోదాంలు వెలుస్తున్నాయి. జిల్లా కలెక్టర్ తక్షణమే చర్యలు తీసుకుని ఈ పరిశ్రమలను తీసివేయాలి.

- జ్యోతి, వెంకటాద్రినగర్



సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న శాసనమండలి మాజీ చైర్మన్ స్వామి గౌడ్



సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు

తెలంగాణకు స్వాతంత్ర్యం తెచ్చింది కేసీఆర్

దుండిగల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): దేశానికి స్వాతంత్ర్యం తెచ్చింది మహాత్మాగాంధీ అయితే తెలంగాణకు స్వాతంత్ర్యం తెచ్చింది తెలంగాణ జాతి బిడ్డ కేసీఆర్ అని శాసన మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్ అన్నారు. ఈనెల 29న తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న దీక్షా దివాస్ కార్యక్రమం నిర్వహణపై గండిమైసమ్మలోని బీఆర్ఎస్ మేడ్చల్ జిల్లా కార్యాలయంలో జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అధ్యక్షతన నిర్వహించిన సన్నాహక సమావేశానికి స్వామిగౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పాలకుల పాలనలో అడుగడుగునా వివక్షతకు గురైన తెలంగాణ ప్రాంతం, కేవలం స్వరాష్ట్ర సాధనతోనే అభివృద్ధి సాధ్యమని నమ్మి, తెలంగాణ వచ్చుడో.... కేసీఆర్ సచ్చుడో అనే ఉద్యమ పంథాలో తెలంగాణలోని అన్ని వర్గాల ప్రజలను ఏకం చేసిన దార్శనికుడు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అని అన్నారు. కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించిన రోజు 29 నవంబరు 2009 తేదీని గుర్తు చేసుకుంటూ ప్రతి సంవత్సరం దీక్షా దివాస్ పేరుతో నాటి ఉద్యమ తీరును నెమరువేసుకోవడం జరుగుతుందన్నారు. రాష్ట్రం ఏర్పడిన అనతికాలంలోనే అభివృద్ధిలో దేశంలోనే నంబరు వన్ స్థాయిలో నిలిచిందన్నారు. నేడు అభివృద్ధి, సంక్షేమం లేక ప్రజలు అవస్థలు పడుతున్నారని, ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కాంగ్రెస్, బీజేపీలకు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. దీక్షాదివాస్ రోజున ప్రతీ కార్యకర్త తన ఇంటి ఎదుట కేసీఆర్ ఫొటోతో కూడిన ఫ్లెక్సీని ఏర్పాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. 29వ తేదీన ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే దీక్షా దివాస్ కార్యక్రమానికి ప్రతీ నాయకుడు, కార్యకర్త తరలివచ్చి విజయవంతం చేయాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని ఆయన అన్నారు. కార్యక్రమంలో మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి, జిల్లా ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద్, మల్లారెడ్డి, మాధవరం కృష్ణారావు, బండారి లక్ష్మారెడ్డి, ప్రజా ప్రతినిధులు, జిల్లాకు చెందిన మేయర్లు, చైర్మన్లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, పీఏసీఎస్ డైరెక్టర్లు, అనుబంద సంఘాల ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, డివిజన్‌ల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న స్వామి వివేకానంద యువజన సంఘం సభ్యులు

ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం

పేట్‌బషీరాబాద్: కుత్బుల్లాపూర్ సర్కిల్ రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని నందానగర్ చౌరస్తాలో మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలను స్వామి వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యువజన సంఘం సభ్యులు జల్దా లక్ష్మీనాథ్, సురేష్, తిమ్మయ్య, గణేష్, దత్తుగౌడ్, సందీప్, సాయికిరణ్, నాగరాజు, ఆనంద్, శేఖర్ డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ప్రభుత్వ జూనియర్ కాలేజీలో...

దుండిగల్: మల్కాజిగిరిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సీహెచ్. విద్యాసాగర్‌రెడ్డి డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల సీనియర్ అధ్యాపకులు శోభారాణి, నవనీత, లక్ష్మి, శివగౌడ్. రాజమౌళి, రహీం, విజయ్, జగన్, సమ్మయ్య, కాలేజి సిబ్బంది పాల్గొన్నారు.



రాజ్యాంగ దినోత్సవ వేడుకలో పాల్గొన్న కాలేజీ సిబ్బంది

ఎస్ఏ పోస్టులను డైరెక్ట్‌గా భర్తీచేయాలి

● బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కష్ణయ్య

కవాడిగూడ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ) పోస్టులను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారానే భర్తీ చేయాలని ఎస్జీటీ టీచర్లకు ఇచ్చే 70 శాతం ప్రమోషన్లను పూర్తిగా తొలగించాలని మాజీ ఎంపీ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశా రు. బీఈడీ నిరుద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో తెలంగాణ రాష్ట్ర బీఈడీ నిరుద్యోగ అభ్యర్థుల సంఘం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీఈడీ నిరుద్యోగ అభ్యర్థులు హాజరయ్యారు. ఆర్. కృష్ణయ్య నిరుద్యోగులకు సంపూర్ణ మద్దతు ప్రకటించి ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డీఈడీ చేసిన వారికి వందశాతం డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా ఎస్జీటీ ఉద్యోగాలు ఏవిధంగా భర్తీ చేస్తున్నారో.. స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగాలను కూడా కేవలం బీఈడీ అభ్యర్థులతో మాత్రమే భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. 2011లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ద్వారా బీఈడీ అభ్యర్థులకు ఎస్జీటీ పరీక్ష రాసే అవకాశం కోల్పోయారని బీఈడీ అభ్యర్థుల పోరాట ఫలితంగా కేంద్ర ప్రభుత్వం బీఈడీ చదివిన అభ్యర్థులకు ఎస్జీటీలకు ఉద్యోగ అవకాశాలు కల్పించిందన్నారు. ఎస్జీటీ ఉద్యోగం పొందిన రెండు సంవత్సరాలలోపు ఆరు నెలల బ్రిడ్జి కోర్సు చదివి పాసవడానికి అవకాశం ఇస్తూ ఇచ్చిన గెజిట్ చెల్లుబాటు కాదన్నారు. 2023లో గెజిట్ చెల్లదని కోర్టు తీర్పుద్వారా బీఈడీ అభ్యర్థులు ఎస్జీటీ ఉద్యోగం పొందే అవకాశం కోల్పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జీవో 108 ప్రకారం స్కూల్ అసిస్టెంట్ పోస్టులను 70 శాతం ప్రమోషన్లతో భర్తీ చేస్తే.. బీఈడీ నిరుద్యోగ అభ్యర్థుల భవిష్యత్ ఏమిటని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ మహాధర్నాలో నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్, నిరుద్యోగ జేఏసీ నాయకులు కల్యాణ్ నాయక్, నరేష్, బీఈడీ అభ్యర్థుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూక్యానాయక్, అశోక్, నందగోపాల్‌తో పాటు బీఈడీ అభ్యర్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

స్విమ్మర్లు నిత్య, సాయికి కాంస్యాలు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్జీఎఫ్ఐ) నిర్వహిస్తున్న జాతీయ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో ఇద్దరు హైదరాబాద్ స్విమ్మర్లు కాంస్య పతకాలు సొంతం చేసుకున్నారు. గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో జరుగుతున్న ఈపోటీల్లో అండర్-17 బాలికల 50 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో నిత్యశ్రీ 32.40 సెకన్లలో రేసును ముగించి తృతీయ స్థానంలో నిలిచింది. అండర్-19 బాలుర 50 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో సాయికత్ చటర్జీ 28.92 సెకన్లలో రేసును పూర్తి చేసి మూడో స్థానం దక్కించుకున్నాడు. ఈ ఇరువురు దుండిగల్‌లోని జియాన్ స్విమ్మింగ్ అకాడమీలో శిక్షణ తీసుకుంటున్నారు.

యువకుడికి అరుదైన శస్త్రచికిత్స



యువకుడికి సర్జరీ చేస్తున్న వైద్యులు

హైదరాబాద్ సిటీ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సన్‌షైన్ బోన్ అండ్ జాయింట్ ఇనిస్టిట్యూట్‌లోని షోల్డర్ సర్జరీ విభాగం, కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రిలో 'ఆర్థోస్కోపిక్ కార్టిలేజ్ షోల్డర్ రిపేర్' అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. పాతికేళ్ల యువకుడు బాస్కెట్‌బాల్ ఆడుతుండగా భుజానికి తీవ్ర గాయమైంది. బేగంపేటలోని ఆస్పత్రికి వచ్చిన అతడికి పరీక్షించిన వైద్యులు ఇటీవల ఆర్థోస్కోపిక్ కార్టిలేజ్ రిపేర్ సర్జరీ చేసినట్లు చీఫ్ షోల్డర్ సర్జన్ డాక్టర్ బి.చంద్రశేఖర్ తెలిపారు. ఈ సర్జరీని హైదరాబాద్‌లో మొట్టమొదటిసారిగా చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకొని కొండ్రో పిల్లర్ టెక్నాలజీ సాయంతో చికిత్స అందించినట్లు వివరించారు. ఎవరైనా భుజం నొప్పి, కదలికలు సరిగ్గా లేకపోవడం వంటి సమస్యలతో బాధపడుతుంటే సరైన చికిత్స తీసుకోవాలని ఆయన సూచించారు.

బంగారం షాపులో దృష్టి మళ్లించి చోరీ

● నిందితురాలి అరెస్టు



నిందితులరాలి నుంచి స్వాధీనం చేసుకున్న ఆభరణాలు

హైదర్‌నగర్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): వినియోగదారులుగా బంగారం షాపునకు వచ్చి సేల్స్‌మన్ కన్నుగప్పి బంగారు ఆభరణాలు చోరీ చేసిన ఓ మహిళను కేపీహెచ్‌బీ పోలీసులు అరెస్టు చేశారు. కూకట్‌పల్లి జోన్ ఏసీపీ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్‌లోని గోకుల్‌టవర్స్‌కు చెందిన పుట్టా సునీత(41) ఈనెల 23న కేపీహెచ్‌బీకాలనీ రోడ్ నంబర్-1 లోని దేవి జువెల్లర్స్‌కు నగలు కొనేందుకని వచ్చింది. ముఖానికి మాస్క్ ధరించి నగలు చూపించాల్సిందిగా సేల్స్‌మన్‌ను కోరింది. నగలు చూపిస్తుండగా అతని దృష్టి మరల్చి బంగారు నగలు దొంగిలించి అక్కడి నుంచి వెళ్లిపోయింది. ఆమె వెళ్లిన తర్వాత నగలు పోయినట్లుగా గుర్తించిన షాప్ యజమాని కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ ఫుటేజ్ ఆధారంగా చోరీకి పాల్పడ్డ సునీతను పాత నేరస్థురాలిగా గుర్తించి దర్యాప్తు చేపట్టారు. ఏసీపీ శ్రీనివాస్‌రావు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని డీఐ రవికుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి పుట్టా సునీతను మంగళవారం అరెస్టు చేశారు. ఆమె వద్ద నుంచి రూ.2,90,000 విలువైన 73 గ్రాముల బంగారు నెక్లెస్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

త్రిబుల్ రైడింగ్.. తస్మాత్ జాగ్రత్త



ద్విచక్ర వాహనంపై ముగ్గురు

పేట్‌బషీరాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): యువత క్రేజీగా రైడింగ్ చేస్తుంటారు. మితి మీరిన డ్రైవింగ్, త్రిబుల్ రైడింగ్‌తోను ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని పోలీసులు పేర్కొంటున్నారు. మైనర్లు సైతం వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నా.. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు బైక్‌లు ఇచ్చే ముందు ఒక్కసారి ఆలోచించాలి. కొంతమంది డ్రైవింగ్ లైసెన్స్ లేకుండానే బైక్‌లు నడుపుతూ ప్రమాదాలకు గురై, తల్లిదండ్రులకు కడుపుకోతను మిగుల్చుతున్నారు. త్రిబుల్ రైడింగ్ చట్ట రీత్యా నేరమని, పట్టుబడితే జైలుకు వెళ్లడం ఖాయమని ట్రాఫిక్ పోలీసులు చెబుతున్నారు.

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని సుచిత్రా, కొంపల్లి, దూలపల్లి తదితర ప్రాంతాల్లో రోడ్లపై స్పీడ్ బైకులు పరుగులు పెడుతున్నాయి. కొందరు యువతకు డ్రైవింగ్ లైసెన్స్ లేకున్నా వాహనాల మీద రయ్‌రయ్ మంటూ తిరుగుతున్నారు. మైనర్లు, యువతీయువకులు ముగ్గురికి మించి బైక్‌లపై ప్రయాణిస్తున్నారు. బైక్‌పై వెళ్లడానికి ఇద్దరికే అనుమతి ఉంది. పరిమితికి మించి ప్రయాణిస్తే, అదుపుతప్పి కిందపడితే ప్రాణాలకే ప్రమాదమని పోలీసులు హెచ్చరిస్తున్నారు. యువతలో బైక్ నడపాలన్న సరదా ఎక్కువగా ఉంటుంది. పిల్లలకు డ్రైవింగ్, లైసెన్స్‌లేని వారికి బైక్‌లు ఇవ్వొద్దని ఆర్‌టీఏ అధికారులు, పోలీసులు హెచ్చరిస్తున్నారు. వారి సరదా తీర్చడానికి తల్లి దండ్రులు పిల్లలకు బైక్‌లు ఇచ్చి ప్రమాదాలకు కారణం కావద్దని సూచిస్తున్నారు. కొందరు తల్లి దండ్రులకు తెలియకుండా బైక్‌లను డ్రైవ్ చేస్తుంటారు. ఇలాంటి వారిపై నిఘా పెట్టాలి.

బాధ్యతగా వ్యవహరించాలి

బైక్‌పై ఇద్దరు కంటే ఎక్కువ మంది ప్రయాణించే విషయంలో యువత బాధ్యతగా వ్యవహరించాలి. ముఖ్యంగా ప్రమాదాలు త్రిబుల్ రైడింగ్‌తోనే ఎక్కువగా అవుతున్నాయి. డ్రైవింగ్ చేస్తూ ఫోన్ మాట్లాడే వారిపై, బైక్ రేసింగ్ చేసే వారిపై ప్రత్యేక దృష్టి పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలి. లైసెన్స్ లేని వారికి వాహనాలు ఇచ్చే వారిపై చర్యలు తీసుకుంటే త్రిబుల్ రైడింగ్, మైనర్లు వాహనాలు నడపడం వంటివి నివారించొచ్చు.

- మధు, సంఘ సేవకుడు

పోలీసులకు దొరికితే కేసులు

త్రిబుల్ రైడింగ్‌లో దొరికితే కేసులు పెట్టి, భారీ జరిమానా విధిస్తున్నాం. తల్లి దండ్రులు స్వయంగా తమ పిల్లలకు బైక్‌లు ఇప్పించి, ఇబ్బందులు కొని తెచ్చుకోవద్దని, ద్విచక్ర వాహనంపై ముగ్గురు ప్రయాణించడం, మద్యం తాగి, పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటాం. రెండుసార్లు త్రిబుల్ రైడింగ్, మద్యం తాగి పట్టుబడితే లైసెన్స్ రద్దు చేస్తాం.

- శ్యామ్‌బాబు, ట్రాఫిక్ ఎస్ఐ

అన్నదమ్ముల వక్రమార్గం

- డబ్బు కోసం గంజాయి సరఫరా ● 18 కిలోల పట్టివేత
- సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో ఇద్దరి అరెస్టు
- వెస్ట్ బెంగాల్ టు మహారాష్ట్రకు గంజాయి సరఫరా



కేసు వివరాలు వెల్లడిస్తున్న జీఆర్‌పీ పోలీసులు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో జీఆర్‌పీ పోలీసులు రూ. 4.50 లక్షల విలువ చేసే 18 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రైల్వే డీఎస్పీ జావెద్, సికింద్రాబాద్ రైల్వే ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్ వివరాలను వెల్లడించారు. పశ్చిమ బెంగాల్ హుగ్లీ మండలం రత్‌టాలా గ్రామానికి చెందిన ప్రీతం చౌదరి(37), సత్యం చౌదరి(29) అన్నదమ్ములు. సులభంగా డబ్బు సంపాదించేందుకు గంజాయి విక్రయించాలని నిర్ణయించుకున్నారు. సోమవారం పశ్చిమ బెంగాల్‌లోని షాలిమార్ పట్టణంలో 18 కిలోల గంజాయి కొనుగోలు చేశారు. ముంబైలో విక్రయించేందుకు రైలులో గంజాయి బ్యాగులతో వస్తున్నారు. మంగళవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో జీఆర్‌పీ సీఐ సాయి ఈశ్వర్‌గౌడ్, ఎస్ఐ మాజిద్, రమేష్‌తో పాటు కానిస్టేబుళ్లు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ప్లాట్ ఫాం నంబరు 2లో ఆగి ఉన్న ముంబై ఎక్స్‌ప్రెస్‌లో లగేజీలను తనిఖీ చేశారు. అన్నదమ్ములను పోలీసులు అదుపులోకి తీసుకుని గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పశ్చిమ బెంగాల్‌గో గంజాయి కొనుగోలు చేసి ఒక్కో ప్యాకెట్ రూ. 18 వేలకు మహారాష్ట్రలో విక్రయిస్తున్నట్లు విచారణలో తేలింది. రైల్వే ఎస్పీ చందనదీప్తి ఆదేశాల మేరకు ప్రతిరోజూ రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేస్తున్నామని జీఆర్‌పీ సీఐ తెలిపారు.